సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీలోకి వలసలు
వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా టీడీపీ నుంచి భారీగా వస్తున్నారు. తాజాగా శనివారం జిల్లాలో పలువురు పార్టీలో చేరారు. -8లో



ఎంతపని చేశావ్ తల్లీ..
అన్నమయ్య జిల్లాలో గాలివీడు మండలంలో విషాదం చోటుచేసుకుంది. ముగ్గురు పిల్లలతో ఓ తల్లి గండిమడుగులో దూకి తల్లి ఆత్మహత్య చేసుకుంది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
41.2/30.2

వాతావరణం
జిల్లాలో శనివారం 30.2 – 41.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఇంటర్ పాస్/ఫెయిల్, డిప్లొమా పాస్/ఫెయిల్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు శిక్షణకు అర్హులన్నారు.18నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు ఉండాలన్నారు. బెంగళూరులో 35 రోజులపాటు కొనసాగే శిక్షణలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

550 ఫిర్యాదులు పరిష్కారం


కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 564 ఫిర్యాదులు అందగా 550 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగా శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ఫిర్యాదుల పరిష్కార నివేదికను విడుదల చేయడం జరిగిందన్నారు. మొత్తం ఫిర్యాదుల్లో 14 ప్రోగ్రెస్ లో ఉన్నాయన్నారు.

- సి.విజిల్ ద్వారా మొత్తం 349 కేసులు నమోదయ్యాయి.అందులో 215 నిజనిర్ధారణ కాగా, 134 నిరాధారమైనవిగా గుర్తించామన్నారు.
- ఎఫ్ఎస్‌టి., ఎస్ఎస్‌టి. పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.3,69,35,295 మేర నగదు, రూ.7,30,15,938 ల విలువైన లిక్కర్, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే 1,028 ఎఫ్.ఐ.ఆర్. కేసులు నమోదు చేయడం జరిగిందని వివరించారు.

పులివెందుల కాంగ్రెస్ పార్టీలో ముసలం

పులివెందుల రూరల్ : పులివెందుల కాంగ్రెస్ పార్టీలో ముసలం నెలకొంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు టీడీపీతో కుమ్మక్కై, కష్టపడిన వారిని గుర్తించకుండా మధ్యలో వచ్చిన వారికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత పార్టీ ఏర్పాటు చేసుకున్న తర్వాత పులివెందులలో 2011 నుంచి కాంగ్రెస్ కనుమరుగైపోయింది. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జిగా వేలూరు శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కష్టపడి పనిచేస్తు వస్తున్నారు. 2024 ఎన్నికల్లో పులివెందుల కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకే దక్కుతుందని ఆశాభావంతో ఉండేవారు. అయితే ఇతన్ని కాదని నిన్నకాక మొన్న పార్టీలోకి వచ్చిన ధృవకుమార్‌రెడ్డికి టికెట్ కేటాయించారు. దీంతో శ్రీనివాసరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. పార్టీ కూడా మారనున్నట్లు తెలిసింది. షర్మిల సొంత ఊరిలోనే అభ్యర్థి విషయంలో వెన్నుపోటు పొడిచిందని కాంగ్రెస్ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ప్రజల సమస్యలు వింటున్న గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టిసారించామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్‌ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేశారు. రాజంపేటకు చెందిన జగదీశ్వర్‌రెడ్డి రాజంపేట–కడప మధ్య తిరుగుతున్న పల్లె వెలుగు సర్వీసులకు స్టేజీలు కుదించి నడపాలని కోరగా అందుకు వీలుపడదని తెలియజేశారు. కడపకు చెందిన యతీస్ కృష్ణ కడప నుంచి చిత్తూరుకు సమయానుకూలంగా బస్సులు లేవని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత 5.30 గంటల వరకు చిత్తూరుకు బస్సు లేదని, రాత్రి 8.00 గంటల తర్వాత రాయచోటి నుంచి కడపకు ఎక్స్‌ప్రెస్ బస్సు లేదని ఫిర్యాదు చేశారు. ఇందుకు కడప, రాయచోటి డిపోల మేనేజర్లను నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. గురజాలకు చెందిన రాఘవరెడ్డి ప్రస్తుతం పులివెందుల నుంచి హైదరాబాద్‌కు నడుస్తున్న బస్సును రూటు మార్చి లింగాల, ఇప్పట్ల, వెలిదండ్ల, గురజాల, పార్నపల్లి, కల్లూరు, సింహాద్రిపురం మీదుగా నడపాలని కోరగా పరిశీలిస్తామన్నారు. కడపకు చెందిన వెంకటేశ్ కడప–బెంగుళూరు మధ్య తిరుగుతున్న బస్సులు పరిశుభ్రంగా లేవని, ఆప్‌కీప్ బాగా లేదని ఫిర్యాదు చేయగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కడప డిపో మేనేజర్‌ను ఆదేశించారు.

ఇదేమి నీతి!




- వైఎస్ కుటుంబాన్ని తానే ఓడగొట్టానంటున్న సీఎం రమేష్
- అదే సీఎం రమేష్ సొంత ఫ్లయిట్లో షర్మిల పర్యటన
- సొంతం అనుకున్నవారే వివేకాను ఓడించారని అక్కాచెల్లెళ్ల ఆరోపణలు
- వైఎస్ కుటుంబం వ్యతిరేకుల కుట్రల్లో షర్మిల, సునీత భాగస్వామ్యం



సాక్షి ప్రతినిధి, కడప: 'వైఎస్ కుటుంబానికి ఓటమి లేదు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు ఏవైనా విజయం వారిదే. మొట్టమొదటిసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ వివేకానందరెడ్డిని నేనే ఓడగొట్టాను. టీడీపీ ఎంపీగా ఓటమి రుచి చూపించాను.' ప్రస్తుత అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఓ మీడియా ప్రతినిధి ఇంటర్వ్యూలో చెప్పారు. వాస్తవం ఇలా ఉంటే ఆ ఇంటి ఆడబిడ్డలు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల డాక్టర్ సునీతలు మరోవిధంగా ఆరోపణలు సంధిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సొంతం అనుకున్నవారే వైఎస్ వివేకానందరెడ్డిని ఓడించారని ఊరువాడ చెప్పుకొస్తున్నారు. కుట్రలు, కుతంత్రాలను అమలు చేసిన వారిని వదిలేసి, అలాంటి వారితోనే చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతూ సొంత కుటుంబ పరువును బజారుకు ఈడుస్తున్నారు. సీఎం రమేష్‌కు చెందిన చార్టెడ్ ఫ్లయిట్‌లో షర్మిల పర్యటిస్తూ, ద్వంద్వనీతి ప్రదర్శిస్తున్నారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

- వైఎస్ కుటుంబంలో ఓటమి లేదు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రమే అప్పటి టీడీపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడి ఓడించింది. 854మంది ఓటర్లల్లో దాదాపు 622 మంది వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపికైన స్థానిక సంస్థల ప్రతినిధులు. కేవలం 234 మంది మాత్రమే టీడీపీ సభ్యులు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్ వివేకానందరెడ్డిని ఎంపిక చేశారు. టీడీపీ నుంచి బీటెక్ రవిని బరిలో దింపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండడంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేశారు. బెదిరింపులకు దిగారు. భౌతిక దాడులు చేశారు. అప్పటి మంత్రి ఆదినారాయణరెడ్డి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్‌లు ఓటర్లను పాండిచ్చేరి, గోవాకు తరలించి క్యాంపులు నిర్వహించారు. సీఎం రమేష్‌కు చెందిన చార్టెడ్ ఫ్లయిట్ నిత్యం అదే పనిగా తిరిగేది. కోట్లాది రూపాయలు మంచినీళ్లలాగా ఖర్చు చేసి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ వివేకానందరెడ్డిని 34ఓట్ల తేడాతో ఓడించారు.



వ్యతిరేక శక్తులతో భాగస్వామ్యం



వైఎస్ కుటుంబానికి చంద్రబాబు, ఈనాడు రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణ రాజకీయంగా బద్ధ విరోధులు. ఇది జగమెరిగిన సత్యం. కాగా వారిందరికి అనువైన నాయకులతో స్నేహ సంబంధాలను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, డాక్టర్ నర్రెడ్డి సునీత పెంచుకున్నారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. శత్రువులతో చేతులు కలిపి కుటుంబ పరువును బజారున పడేస్తున్నారని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వీరవిధేయులు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణకు చెందిన కొండా రాఘవరెడ్డి లాంటివారు సైతం కడప వచ్చి వీరి శైలిని తప్పుబట్టడం విశేషం.

ఇది వాస్తవం అయితే, సొంతవారే ఓడించారని డాక్టర్ సునీత, షర్మిల పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారని విశ్లేషకులు చెప్పుకొచ్చారు.

సీఎం రమేష్ ఫ్లయిట్‌లోనే పర్యటన

వైఎస్ కుటుంబానికి మొట్టమొదటి ఓటమి చూపించానని చెప్పుకుంటున్న సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ గ్రీన్ పవర్ అండ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన చార్టెడ్ ఫ్లయిట్‌లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను తరలించేందుకు ఉపయోగించిన అదే స్పెషల్ ఫ్లయిట్‌లో కడపకు రెండుసార్లు షర్మిల వచ్చారు. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్యర్థిగా నిలిచిన బీటెక్ రవి, అప్పట్లో మంత్రిగా ఉంటూ ఎన్నికల్లో ఓటమికి కారకుడైన ఆదినారాయణరెడ్డిలతో కలిసి మార్చి 15న జయరాజ్ గార్డెన్‌లో వైఎస్ వివేకానందరెడ్డి వర్ధంతి వేడుకలను డాక్టర్ సునీత, షర్మిల పాలుపంచుకోవడం విశేషం. ఈ అక్కాచెల్లెళ్ల ద్వంద్వనీతిని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

కౌసల్య తనయా.. నమోనమో

నవనీత కృష్ణాలంకారంలో కోదండరామయ్య అభయం



నవనీతకృష్ణాలంకారంలో మాడవీధుల్లో ఊరేగుతున్న శ్రీరాముడు

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నాలుగోరోజు శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారు నవనీతకృష్ణాలంకారంలో దర్శనమిచ్చారు. పురాణాల ప్రకారం కృష్ణుడు వెన్న దొంగ, రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంటిలోనే గాక అందరి ఇళ్లల్లో దూరి వెన్న దొంగిలించి ఆరగించేవాడు. ఈ చిన్ని కృష్ణుడిని లీలలను గుర్తు చేస్తూ రాముల వారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 11 నుంచి 12 వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనే, చందనంతో సీతారామలక్ష్మణుల విగ్రహాలకు అభిషేకం చేశారు. రాత్రి కోదండరామస్వామి వారు హనుమంతవాహనంపై విహరించారు.భక్తులు దర్శించుకుని తరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో ఐదోరోజు ఆదివారం ఉదయం మోహినీ అలంకారంలో స్వామి వారు భక్తులకు అభయమిస్తారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ ఉంటుంది. అనంతరం రాత్రి 7 నుంచి 9:00 గంటల వరకు గరుడసేవ నిర్వహిస్తారు.

ముత్యాల తలంబ్రాలు సిద్ధం
ఈనెల 22న సీతారాముల కల్యాణానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు అందించేందుకు తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం, ముత్యాల తలంబ్రాలకు సంబంధించి ప్యాకింగ్ శనివారం సిద్ధమయ్యాయి.

● ఏకశిలానగరం..శోభాయమానం



బ్రహ్మోత్సవాల్లో భాగంగా రంగురంగుల విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతున్న ఒంటిమిట్ట కోదండరామాలయం

రేపటి నుంచి కమలాపురం దర్గా ఉరుసు



పోస్టర్లను విడుదల చేస్తున్న దర్గా కన్వీనర్ ఇస్మాయిల్, ఎస్ఐ,కమిషనర్ తదితరులు

కమలాపురం: కమలాపురం దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా ఉరుసు ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానుది. ఉరుసు ఉత్సవాలను జయప్రదం చేయాలని పీఠాధిపతి సజ్జాద్–ఏ–నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి సోదరులు, దర్గా కన్వీనర్ ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆ దర్గా ఆవరణలో ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి, నగర కమిషనర్ రాముడు, దర్గా కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలతో కలసి ఆయన ఉరుసు ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా జరిగే కమలాపురం గఫార్ షా ఖాద్రి 104వ ఉరుసు మహోత్సవాలను ఈనెల 22వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. 22న నషాన్‌తో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని, 23న గంధం, 24న ఉరుసు, 25న తహలీల్‌తో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దర్గా యూత్ ఖాద్రి, జిలాన్, శ్రీను, గాంధీ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పట్టాభిరాముని బ్రహ్మోత్సవాలు

వాల్మీకిపురం: వాల్మీకిపురంలో వెలసిన శ్రీ పట్టాభిరామస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి 10 గంటలకు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ విశేష పూజలతో ధ్వజావరోహణంతో ముగిశాయి. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, అర్చన, బలి, శాత్తుమొర నిర్వహించారు. ఉదయం 7గంటలకు స్వామివారికి వసంతోత్సవం నిర్వహించిన అనంతరం స్వామివారిని తిరుమాడ వీధుల్లో విహరింపజేస్తూ కోలాహలంగా భక్తులు వసంతోత్సవం జరుపుకున్నారు. సీతారామలక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు.

3వ రోజు.. 19 నామినేషన్లు

- వైఎస్సార్ జిల్లాలో లోకసభకు 4, అసెంబ్లీకి 4.
- అన్నమయ్య జిల్లాలో లోక్‌సభకు 01, అసెంబ్లీకి 10

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో మూడవ రోజైన శనివారం మొత్తం 19 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్ జిల్లాలో దాఖలైన మొత్తం ఎనిమిది నామినేషన్లలో కడప లోక్‌సభ స్థానానికి నాలుగు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండు రెండు చొప్పున నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. కడప, బద్వేలు, పులివెందుల, కమలాపురం, మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు.

షర్మిల నామినేషన్
పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఉదయం 11 గంటలకు కడప లోక్‌సభ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి విజయరామరాజుకు నామినేషన్ పత్రం, అఫిడవిట్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట సునీత, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుమునుపు ఆమె నగరంలో ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, చిన్నపురెడ్డి గోపాలకృష్ణారెడ్డి నామినేషన్ దాఖలు చేయగా, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థిగా జక్కం వెంకట రమణ నామినేషన్ వేశారు.

- జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కుందవరం రమేష్, పీఆర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి నామినేషన్లు వేశారు. ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పుత్తా లక్ష్మిరెడ్డి, జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా పసగాని కరుణాకర్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో అభ్యర్థులకు నామినేషన్స్ వెరిఫికేషన్ కౌంటర్, సెక్యూరిటీ డిపాజిట్ కౌంటర్‌లో సదుపాయాలు కల్పించారు. నామినేషన్ల సందర్భంగా ఆర్వో కార్యాలయాల్లో పటిష్ఠ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రాయచోటి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలో మూడోరోజు 11 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ తెలిపారు. శనివారం రాజంపేట–24 పార్లమెంటు స్థానంతోపాటు 4 అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. తంబళ్లపల్లి, కోడూరు అసెంబ్లీ స్థానాలకు మూడో రోజున నామినేషన్లు దాఖలు కాలేదు.

పార్లమెంటుకు 1..
రాజంపేట–24 పార్లమెంట్ స్థానానికి శనివారం జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థిగా మాదరాజా నామినేషన్ దాఖలు చేశారు. రాజా ఇప్పటికే ఒక నామినేషన్ దాఖలు చేసి ఉన్నారు.

అన్నమయ్య జిల్లాలో..

అసెంబ్లీకి 10 నామినేషన్లు...
శనివారం మూడోరోజున అసెంబ్లీ అభ్యర్థులుగా 10 మంది ఆయా ప్రాంతాలలోని రిటర్నింగ్ అధికారుల వద్ద నామినేషన్లు దాఖలు చేశారు.

125–రాజంపేట అసెంబ్లీ స్థానానికి...
1. సీపీఐ అభ్యర్థిగా బుక్కే విశ్వనాథ్ నాయక్, 2. ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎస్.సాల్మాన్, 3. ఇండిపెండెంట్ అభ్యర్థిగా కోనేటి హరి వెంకటరమణ.

128– రాయచోటి అసెంబ్లీ స్థానానికి..
- అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రేపన మనోహర్

127– కోడూరు (ఎస్సీ): నిల్
162–తంబళ్లపల్లి: నిల్
163 పీలేరు..
ఇండిపెండెంట్ అభ్యర్థిగా పాలవల్లి రామకృష్ణారెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కె.బ్రహ్మయ్య ఆచారి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కె. చిన్న రెడ్డప్పరెడ్డి

164 మదనపల్లి....
జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక అభ్యర్థిగా నారవుల మణిశంకర్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎం.నరేంద్ర.

కోట్లాదిమందితో జగన్ మమేకం

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



పెద్దిరెడ్డి, ఆకేపాటి, మేడాను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

రాజంపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోటిన్నరకుపైగా జనంతో మమేకమయ్యారని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం రాజంపేట బైపాస్‌లో కళాంజలి గార్డెన్స్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంపీ మేడా రఘునాథరెడ్డి కోరిక మేరకు ఈ ప్రాంతానికి సంబంధించి జీఎన్ఎస్ఎస్ కాలువను పూర్తి చేసేందుకు ఫారెస్టు క్లియరెన్స్‌కు తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే రాజంపేటకు రింగ్‌రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ అభ్యర్థి పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు.

- ఎంపీ మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ రెండవసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పుంగనూరు తరహాలోనే రాజంపేటను అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు.

రాయచోటి నుంచి అభ్యర్థిని తీసుకురావడం అవమానకరం
తెలుగుదేశం పార్టీకి అభ్యర్థి లేక రాయచోటి నుంచి అభ్యర్థిని తీసుకురావడం రాజంపేట ప్రాంతానికి అవమానకరమని ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. తాను లోకల్ అని, ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. సీఎంగా కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పుడు రాజంపేటకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సైనిక్‌స్కూల్‌ను కలికిరి తీసుకెళ్లారన్నారు.

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ సురేష్‌బాబు మాట్లాడుతూ పేదల సంక్షేమం కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రి కావాలని, అందుకు ప్రజలందరూ ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు పోలా శ్రీనివాసులరెడ్డి, వీరబల్లి మదన్‌రెడ్డి, పీసీ యోగీశ్వరరెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, ఈశ్వరయ్య, జీవీ సుబ్బారెడ్డి, ఖాజామొహిద్దీన్, గోపిరెడ్డి, దండుగోపి, రామ్మోహన్ నాయుడు, మర్రి రవి, నీలకంఠారెడ్డి, రామస్వామిరెడ్డి, అన్నం నాగేంద్ర, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి గాలివీటి రాజేంద్రనాథరెడ్డి,, యర్రపురెడ్డి అజయ్‌రెడ్డి, అజంతమ్మ, శ్రీవాణి, ఏకుల రాజేశ్వరి, మిరయాల సురేఖ, సుజాత తదితరులు మాట్లాడారు.

పెద్దిరెడ్డికి సత్కారం
రాజంపేట కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నాయకులు, కార్యకర్తలు గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి, కువైట్ వైఎస్సార్‌సీపీ కో–కన్వీనర్ గోవిందనాగరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, పోలిమురళి దాసరి పెంచలయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబును తరిమికొట్టే రోజు దగ్గర్లో ఉంది

రైల్వేకోడూరు: నాడు ప్రజలకు లేనిపోని హామీలు ఇచ్చి ఆ హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించిన చంద్రబాబును ఇప్పుడు ప్రజలు పూర్తిస్థాయిలో తరిమికొట్టే రోజు దగ్గర్లోనే ఉందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం రైల్వేకోడూరులోని రాజ్ కల్యాణ మండపంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో ఆయన సమీక్ష జరిపారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పించి సమావేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత దేశంలోనే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కొత్తగా హైదరాబాద్ నుంచి ఎన్నికల సమయంలో సూట్‌కేసులతో వచ్చి రాజకీయం చేయాలనుకునే కిరణ్‌కుమార్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ ఒక కుటుంబం లాంటిదని, చిన్నచిన్న సమస్యలు సహజం.. వాటిని పరిష్కరించుకుని, వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

క్లుప్తంగా

సమాజంలోని ధర్మేతర శక్తులను అడ్డుకోవాలి

– స్వామీజీల పిలుపు



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జాతీయ సహ కార్యదర్శి గుమ్మళ్ల సత్యంజీ

కడప కల్చరల్ : సమాజంలో ధర్మానికి హాని కలిగించే శక్తులను అడ్డుకోవాలని స్వామీజీలు పిలుపునిచ్చారు. విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో కడప శివారులోని శ్రీ లలితా పంచాయతన దేవాలయంలో శనివారం ధర్మాచార్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి దక్షిణాంధ్రప్రదేశ్‌లోని అన్ని పీఠాల అధిపతులు మొత్తం 62 మంది ఆరుగురు స్వామినీలు హాజరయ్యారు. హాజరైన స్వామిజీలందరూ ఈ అంశంపై ఏకాభిప్రాయంతో తమ తమ అభిప్రాయాలను తెలిపారు. వీహెచ్‌పీ జాతీయ సహ కార్యదర్శి గుమ్మళ్ల సత్యంజీ సమావేశపు ఉద్దేశాన్ని వివరించి సమాజంలో ధర్మాచరణ ఆవశ్యకత గురించి వివరించారు. ఈ సమావేశానికి ఆలయ నిర్వాహకులు చిన్మయ మిషన్ పీఠాధిపతులు శ్రీ తురీయానంద సరస్వతి స్వామీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ మార్గదర్శక మండలి సభ్యులు, అచలానందాశ్రమం పీఠాధిపతులు శ్రీ విరజానంద స్వామీ మాట్లాడారు. తిరుపతి లలితా పీఠాధిపతులు శ్రీ స్వరూపానంద స్వామీజీ, తిరుపతి రామకృష్ణమఠం పీఠాధిపతులు శ్రీ సుకృతానంద, భాగ్యనగర క్షేత్ర సంఘటనా కార్యదర్శి గుమ్మళ్ల సత్యంజీ, దక్షిణాంధ్ర ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు, దక్షిణాంధ్ర ప్రాంత సహకార్యదర్శి కోటేశ్వరరావు, ధర్మాచార్య ప్రముఖ్ బి.రాం మహేష్, స్వామి శివరామానంద సరస్వతి మాట్లాడారు. బ్రహ్మంగారి మఠం, ఈశ్వరీయ మఠం పీఠాధిపతులు శివ స్వామితో పాటు వివిధ జిల్లాల నుండి వచ్చిన స్వామీజీలు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

వల్లూరు : మండల పరిధిలోని తప్పెట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో శనివారం ట్రాక్టర్ బోల్తా పడింది. యర్రగుంట్ల నుండి వల్లూరు వైపునకు ఇనుప కడ్డీలను లోడు చేసుకుని వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తమై పక్కకు దూకి వేయడంతో ప్రాణ నష్టం జరగలేదు. ట్రాక్టర్ రోడ్డుకు అడ్డంగా పడి పోవడంతో వాహనాల రాక పోకలు నిలిచి పోయాయి. ఎస్‌ఐ వెంకట రమణ తన సిబ్బందితో జేసీబీ ద్వారా ట్రాక్టర్‌ను తొలగించి రాక పోకలను కొనసాగించారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ

- టీడీపీ కౌన్సిలర్ తో పాటు 135 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- సాదరంగా ఆహ్వానించిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



బద్వేలులో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కౌన్సిలర్, మైనార్టీ కుటుంబాలతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ



మైదుకూరులో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కొత్తపేట గ్రామస్తులు

బద్వేలు అర్బన్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 13, 24 వార్డుల్లో శనివారం పలువురు ముఖ్యనేతలతో పాటు 135 కుటుంబాలు టీడీపీ నుండి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. పార్టీలో చేరుతున్న వారికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. స్థానిక 24వ వార్డులో మాజీ కౌన్సిలర్ తుమ్మిశెట్టి వెంకట సుబ్బయ్య, ఆయన కుమారులు సునీల్, సుదర్శన్‌తో పాటు ఆడిటర్ శివకుమార్, ప్లానర్ జాజంరాజులతో పాటు 35 కుటుంబాలు టీడీపీ నుండి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా స్థానిక వెంకటయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ముస్లింల సంక్షేమం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ముస్లింల సంక్షేమం సాధ్యమవుతుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ఆ వార్డు ఇన్‌చార్జి షేక్ ఉమర్ ఆధ్వర్యంలో వార్డు టీడీపీ కౌన్సిలర్ మహమ్మద్‌హుసన్‌తో పాటు జాకీర్‌హుస్సేన్, మహబూబ్‌బాష, సయ్యద్‌ఆషిక్, యూసఫ్‌లతో పాటు 100 కుటుంబాలు టీడీపీ నుండి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వార్డులోని మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్ మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్య, ఉద్యోగ అవకాశాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించారని, ఆ రిజర్వేషన్‌ను ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపాడుతూ కొనసాగిస్తూ వస్తున్నారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంత వరకు ఆ రిజర్వేషన్‌ను ఎవరూ రద్దు చేయలేరని అన్నారు. టీడీపీ హయాంలో మైనార్టీలను కేవలం ఓటుబ్యాంకుగా చూస్తూ వారి వెనుకబాటుకు చంద్రబాబు కారణమయ్యారని గుర్తుచేశారు. అంతేకాకుండా అధికారం కోసం మతతత్వ పార్టీ అయిన బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు మరోసారి మైనార్టీలను మోసగించేందుకు సిద్ధమయ్యారని అన్నారు. అలాగే బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.130 కోట్లు నిధులు మంజూరు చేశారని, వాటిలో సుమారు రూ.50 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని, ఎన్నికల తర్వాత మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మిగిలిన పనులు కూడా పూర్తి చేస్తామన్నారు.
కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బాబ్జీ, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షఫి, కౌన్సిలర్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

50 కుటుంబాలు చేరిక

జమ్మలమడుగు : పట్టణంలోని 20వ వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సమక్షంలో దొమ్మరనంద్యాల హనీఫ్‌తో పాటు మరో 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. అదే విధంగా బీసీ కాలనీలో షేక్ మగ్బూల్‌తోపాటు అతని అనుచరులు 40 మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

50 కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీలో చేరిక

చింతకొమ్మదిన్నె : కడప పరిధిలోని ఊటుకూరు గ్రామంలో శనివారం 45వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, సీకే దిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులు రెడ్డి సమక్షంలో టీడీపీ సీనియర్ నాయకుడు కర్నాటి సత్యనారాయణ రెడ్డి ఆయన అనుచర వర్గం దాదాపు 50 కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ గుత్తి రెడ్డి చంద్రహాసరెడ్డి, 16వ డివిజన్ ఇంచార్జ్ నాగిరెడ్డి ప్రసాద్ రెడ్డి, కర్నాటి ఈశ్వర్ రెడ్డి, చీమల శివరామిరెడ్డి, చీమల బాల అంకిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

500 కుటుంబాలు చేరిక

రాజుపాళెం : టీడీపీ రాజుపాళెం మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డికి వైఎస్సార్‌సీపీలో మంచి గుర్తింపు ఇస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి అన్నారు. మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన విశ్వనాథ రెడ్డి, మాజీ సర్పంచ్ ధనిరెడ్డి జయలక్ష్మమ్మ ఆధ్వర్యంలో శనివారం టీడీపీలో నంచి వైఎస్సార్‌సీపీలోకి 500 కుటుంబాలకు ఎమ్మెల్యే రాచమల్లు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అందులో సర్పంచ్ కరుణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు గుత్తి దస్తగిరి, ధనిరెడ్డి జగన్నాథరెడ్డి, రఘునాథ రెడ్డి, హరినాథరెడ్డి, బాబుల్ రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, కార్తీక్ కుమార్ రెడ్డి, చంద్రశేఖర రెడ్డి, అంగదాల గోపాల్, ప్రేమ్ సాగర్, డేవిడ్ తదితరులు చేరినట్లు తెలిపారు. ముందుగా గ్రామ వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముడియం గౌతంరెడ్డి, సోమేశ్వర స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి ఇంటి వద్దకు ఎమ్మెల్యే రాచమల్లు వెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ ఈ టంగుటూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని, రాచమల్లు నాయకత్వానికి మరింత బలం చేకూరిందన్నారు. మండలంలో బంధువులను, స్నేహితులను కలుపుకుంటూ వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేస్తున్న మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకరరెడ్డికి నా ధన్యవాదాలు తెలుపుతూ, అభినందిస్తున్నానన్నారు. అలాగే గ్రామంలోని తులశమ్మ ఇంటి వద్దకు ఎమ్మెల్యే వెళ్లారు. అంతకుముందు బయపురెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కందుకూరు వెంకటసుబ్బన్న ఇంటి వద్దకు ఎమ్మెల్యే వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహా రెడ్డి, మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర రెడ్డి, ధనిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాజారాం రెడ్డి, సోమేశ్వర ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, రఘురామిరెడ్డి, మహేష్ రెడ్డి, సుభాన్, మాజీ సర్పంచ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో వైఎస్సార్‌సీపీలో చేరినవారితో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



సీకే దిన్నెలో పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



టంగుటూరులో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాచమల్లు

మాజీ కౌన్సిలర్ చేరిక



మాజీ కౌన్సిలర్ కోటపాటి శ్రీధర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్ : మాజీ కౌన్సిలర్ కోటపాటి శ్రీధర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఎర్రముక్కపల్లెలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, 19వ డివిజన్ ఇన్‌చార్జి లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు సీహెచ్ వినోద్ పాల్గొన్నారు.

170 కుటుంబాలు..

మైదుకూరు : మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఖాజీపేట మండలం కొత్తపేటకు చెందిన 100 కుటుంబాల వారు టీడీపీని వీడి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మైదుకూరు పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో, 13వ వార్డుకు చెందిన 70 కుటుంబాల వారు టీడీపీ నుంచి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, శెట్టిపల్లె సిద్దారెడ్డి ఆధ్వర్యంలో కొత్తపేటకు చెందిన పాలకొలను రాజశేఖర్‌రెడ్డి, పాలకొలను రామకృష్ణారెడ్డి, పోకల శ్రీకాంత్‌రెడ్డి, పుల్లం చెరువు భాస్కర్‌రెడ్డి, పుల్లం చెరువు బాలకృష్ణారెడ్డి, పాలకొలను మధుసూదన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, వెంకటేష్, షేక్ హసన్, గొట్టిగంటి చంద్రశేఖర్, యడవల్లి గురయ్య, పెండ్లిమర్రి శివకుమార్, బాలగురయ్య, గురయ్య, పెంచలయ్య, వెంకటేష్, చిన్న రెడ్డయ్య, ప్రవీణ్, శేఖర్, కందూరు నగేష్, డేవిడ్, చెన్నకేశవులు, శేఖర్, చెన్నకృష్ణయ్య, అబ్దుల్, రాజోలు శ్రీనివాసులు, రామశేఖర్ రెడ్డి తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలను వేసి వైఎస్సార్‌సీపీలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు అశోక్ రెడ్డి(బాబ్జి), కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ డీఎల్ శ్రీనివాసులరెడ్డి, రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌లో...

మైదుకూరు పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో 13వ వార్డుకు చెందిన పాశం సురేష్, అతని ఆధ్వర్యంలో పి.పెద్ద వెంకటయ్య, శేగినేని రవిశంకర్, లక్ష్మీదేవి, శేషయ్య, రామయ్య, పి.రత్నాలు, హర్ష, పి.నరసయ్య, ఎస్.లక్ష్మీదేవి, ఫాతిమా, రమణయ్య, శ్రీను, దేవి, లక్ష్మీదేవి, సురేంద్ర, పి.రామలక్ష్మమ్మ తదితర 70 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, భరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంతపని చేశావు తల్లీ..

మద్యానికి బానిసైన భర్త బాధ్యత మరిచాడు. అన్యోన్యంగా భార్యను చూసుకోవాల్సింది పోయి గొడవ పడడం మొదలుపెట్టాడు. ముగ్గురు బిడ్డలు ఉన్నారు.. కష్టపడి కుటుంబాన్ని పోషించాలనే విషయం పక్కనపెట్టాడు. తరచూ భార్యతో ఘర్షణకు దిగడంతో ఆమె మనస్తాపం చెందింది. పిల్లలతో సహా మడుగులో దూకింది. నలుగురూ మృత్యువాత పడ్డారు. ఈ విషాదఘటన చూసినవారు ఎంతపని చేశావు తల్లీ అంటూ కన్నీటి పర్యంతం అయ్యారు.

- ముగ్గురు పిల్లలతో తల్లి ఆత్మహత్య
- అన్నమయ్య జిల్లాలో విషాదం



గండిమడుగు నుంచి వెలికితీసిన తల్లీపిల్లల మృతదేహాలు

గాలివీడు : అన్నమయ్య జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. గాలివీడు మండలం వైఎస్సార్ రిజర్వాయర్ సమీపంలోని గండిమడుగులో దూకి ఓ కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు.. రామాపురం మండలం చిట్లూరుకు చెందిన రమణయ్య, రమణమ్మల కుమార్తె నాగమణికి 12 సంవత్సరాల క్రితం గాలివీడు మండలం చిలకలూరిపేటకు చెందిన విక్రమ్‌తో వివాహం జరిగింది. వీరికి నవ్యశ్రీ , దినేష్, జాన్వి ముగ్గురు పిల్లలు. విక్రమ్ ఆటో నడపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల విక్రమ్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ భార్యభర్తలు గొడవపడేవారు. ఇదే క్రమంలో గురువారం భార్యభర్తల మధ్య గొడవ జరిందె. దీంతో మనస్థాపం చెందిన నాగమణి తన ముగ్గురు పిల్లలతో ఇంటి నుంచి బయటికి వచ్చేసింది. తన భార్యా పిల్లలు కనిపించ లేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేముల విక్రమ్ గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వెలిగల్లు రిజర్వాయర్ సమీపంలో గాలిస్తుండగా గండిమడుగు పరిసర ప్రాంతంలో నాగమణి సెల్‌ఫోన్, పాదరక్షలు కనిపించాయి. దీంతో పిల్లలతో సహా మడుగులో దూకినట్లు గుర్తించి మండల ఎస్‌ఐ వెంకట ప్రసాద్‌కు సమాచారం అందించారు. ఎస్‌ఐ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో నాగమణి(30), నవ్యశ్రీ(10), దినేష్(6), జాన్వి(4) మృతదేహాలను బయటకు తీయించారు. పంచనామ నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విక్రమ్‌పై కేసు నమోదు చేసినట్లు నిందితుడిని అరెస్టు చేసినట్లు మండల ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనతో చిలకలూరిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జగన్‌ను మళ్లీ సీఎం చేయడం కోసం కృషి

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సూర్యం



ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న సూర్యం

జమ్మలమడుగు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు సీఎంగా చేసుకోవడంతోపాటు, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా సుధీర్ రెడ్డిని గెలిపించుకోవడం కోసం తనవంతు కృషి చేస్తానని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తదితరులు సూర్యనారాయణరెడ్డితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబానికి వైఎస్ కుటుంబంతో వీడదీయరాని బంధం ఉందన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. నాలుగు సంవత్సరాల కిందట ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరానన్నారు. అయితే అప్పటినుంచి క్రియా శీలక రాజకీయాలకు దూరంగా ఉన్నానని.. ప్రస్తుతం ఎన్నికల తరుణం వచ్చింది కాబట్టి వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పనిచేస్తానన్నారు. దేవగుడి కుటుంబ సభ్యులు బంధువులు అయినా.. బంధుత్వం వేరు రాజకీయం వేరు అన్నారు. తమ అనుచరులతో కష్టపడి పనిచేసి భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవడం కోసం కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో పట్టణంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీకి గట్టిషాక్...

టీడీపీ, బీజేపీకి గట్టి షాక్ తగిలింది. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేస్తామని ప్రకటించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తదితరులు సూర్యం ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. చర్చలు సఫలం కావడంతో దేవగుడి కుటుంబానికి గట్టి షాక్ తగిలింది. తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి దేవగుడి కుటుంబీకులకు స్వయానా బావ. తాతిరెడ్డి తులసి గతంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. 30 సంవత్సరాల పాటు దేవగుడి కుటుంబీకులతో రాజకీయం చేసిన సూర్యం ప్రస్తుతం దేవగుడి కుటుంబానికి వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోతుండటంతో రాజకీయం రసవత్తరంగా మారింది.

గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం రవీంద్రనగర్‌కు వెళ్లే రహదారిలో వంతెన కింద కొంతమంది గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో శనివారం ఉదయం సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐలు మధుసూదన్ రెడ్డి, రంగస్వామి తమ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. యువకులలో రాజారెడ్డి వీధికి చెందిన మహబూబ్‌బాషా, ఏపిహెచ్‌బి కాలనీకి చెందిన సాయిరాం, చలమారెడ్డిపల్లెకు చెందిన పత్తూరు శివను అరెస్ట్ చేశారు. వారి నుంచి 1200 గ్రాముల గంజాయి, రూ.2500 నగదును సీజ్ చేశారు.

పేగు బంధం మరచి..

వృద్ధాప్యంలో ఉన్న తల్లిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన ఓ కొడుకు పేగు బంధాన్ని మరిచాడు. మద్యానికి బానిసై తల్లికి వస్తున్న వృద్ధాప్య పింఛన్ లాక్కోవడానికి ప్రయత్నించాడు. ఆమె నిరాకరించడంతో గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు.



- మద్యానికి డబ్బు ఇవ్వలేదని కన్నతల్లి పై దాడి

మదనపల్లె : మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని వృద్ధురాలైన తల్లిపై కనికరం లేకుండా ఓ కన్న కొడుకు నిర్దాక్షిణ్యంగా దాడి చేసి కాలు విరగ్గొట్టిన సంఘటన శనివారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. వాల్మీకిపురం పంచాయతీ ఫతేపురం గ్రామానికి చెందిన రెడ్డప్ప భార్య వెంకట రమణమ్మ (80)కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కాగా, రెండో కుమారుడు లక్ష్మన్న కుటుంబంతో కలిసి ఆమె ఉంటోంది. ఆమెకు ప్రతినెలా వృద్ధాప్య పింఛన్ అందుతుంది. ఆమె కుమారుడు లక్ష్మన్న మద్యానికి బానిసై, కుటుంబ బాధ్యతల పట్ల నిర్లక్ష్యం వహించేవాడు. ప్రతినెలా పింఛన్ డబ్బులు లాగేసుకుని ఖర్చు పెట్టేవాడు. ఈ నెలలో ప్రభుత్వం అందజేసిన పింఛన్ నగదు వెంకటరమణమ్మ కొడుకు లక్ష్మన్నకు ఇవ్వకుండా అలాగే ఉంచుకుంది. ఈ క్రమంలో శనివారం పింఛన్ డబ్బులు మద్యం తాగేందుకు ఇవ్వాల్సిందిగా తల్లితో గొడవపడ్డాడు. ఆమె ఇచ్చేందుకు నిరాకరించడంతో ఇంట్లో ఉన్న గొడ్డలితో ఆమెపై దాడి చేశాడు. గొడ్డలి కట్టె తో విచక్షణ రహితంగా ఆమెను కొట్టడంతో ఎడమ కాలు మూడు చోట్ల ఫ్రాక్చర్ అయింది. గమనించిన స్థానికులు, పెద్ద కుమారుడు బాధితురాలిని వెంటనే 108 లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. కొడుకు దాడి చేసి కాలు విరగగొట్టినా, ఆసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న విలేకరులతో నా కొడుకును ఎవరూ కొట్టవద్దని చేతులు జోడించి, ప్రాధేయపడటం తల్లి మనసుకు అద్దం పట్టింది. వాల్మీకిపురం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వారిద్దరూ అన్నదమ్ములు. ఎంతో అనుబంధంతో ఉండాల్సిన వారు పొలం గట్టు విషయమై ఘర్షణకు దిగారు. సర్దుకు పోకుండా పంతాలకు పోయారు. ఈ క్రమంలో ఆగ్రహించిన తమ్ముడు కత్తితో అన్నపై దాడికి తెగబడ్డాడు. తీవ్రంగా గాయపడిన అన్న చికిత్స పొందుతున్నాడు.



- అన్నపై తమ్ముడు దాడి

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి అనే వ్యక్తిపై అతని తమ్ముడు రాజశేఖర్‌రెడ్డి అరటి చెట్లు నరికే కత్తితో దాడిచేశాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన అతని తమ్ముడు రాజశేఖర్‌రెడ్డికి పొలం గట్టు విషయమై తగాదా ఉంది. పొలం గట్టు విషయంపై అన్నదమ్ములు ఇద్దరు శనివారం ఉదయం ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో పులివెందులకు వచ్చిన రఘునాథరెడ్డిపై అతని తమ్ముడు రాజశేఖర్‌రెడ్డి బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలోని బైపాస్ రోడ్డులో అరటిచెట్లు నరికే కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రఘునాథరెడ్డిని చికిత్స కోసం 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమచికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.